## సీసీతు లక్ష్యాలకు.. ఎక్స్‌టర్నల్ దెబ్బ



2

## ఉపాధి హామీ పనుల పరిశీలన



2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

1-9-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగింపు



**అక్షరటుడే, భీమ్‌గల్ :** భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల నుంచి నూతన పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ గజనంద్ తెలిపారు. అర్హత కలిగిన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లు గీత, చేనేత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఒంటరి మహిళా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు చివరి తేదీకి కనీసం మూడు రోజుల ముందే తమ పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు.



# రైతులకు ‘యాప్’సోపాలు..

■ యూరియా కోసం తప్పని తిప్పలు ■ ఆన్‌లైన్‌లో బుక్ కాని ఎరువులు ■ నిమిషాల్లో ఖాళీ అవుతున్న స్టాక్

యూరియా కొరతతో ఉమ్మడి జిల్లా అన్నదాతలు తీవ్ర ఆగచాట్లు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు వర్షా లు సకాలంలో కురవక పంటలపై ఆందోళన చెందుతున్న అన్నదాతలకు.. మరోవైపు అవసరమైన సమయంలో యూరియా దొరకకపోవడం మరింత సమస్యగా మారింది.

**- అక్షరటుడే, డిచ్‌పల్లి**

యూరియా స్టాక్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నామని అధికారులు చెబుతున్నా.. యాప్‌లో స్టాక్ కనిపించిన కొద్ది క్షణాల్లోనే బుకింగ్ పూర్తవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో గంటల తరబడి సొసైటీలు, ఎరువుల దుకాణాల వద్ద వేచి చూసినా ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు.

ప్రభుత్వం యూరియా, ఇతర ఎరువుల కొనుగోలు కోసం యాప్‌ను తీసుకొచ్చింది. ఆ యాప్‌లో బుక్ చేసుకుంటేనే ఎరువులు కొనుగోలు చేయొచ్చు. డీఏపీ, ఎంవోపీ, ఎన్‌పీకే వంటి ఎరువుల బుకింగ్‌కు ప్రస్తుతం ఇబ్బందులు లేవు. అయితే యూరియా బుక్ చేద్దామంటే స్టాక్ ఉండటం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో స్టాక్ అప్‌డేట్ చేసిన.. క్షణాల్లోనే మాయం అవుతోందని పేర్కొంటున్నారు. దీంతో స్మార్ట్‌ఫోన్ వాడటం రానివారు, చదువు కోని వారికి యూరియా దొరకడం లేదని చెబుతున్నారు. ఎరువుల యాప్‌లతో ఇబ్బందులు పడుతున్నామని పలు చోట్ల రైతులు ఆందోళన చేపడుతున్నారు. యాప్‌లను తక్షణమే తొలగించి.. గతంలో మాదిరిగా రైతులకు నేరుగా ఎరువులు అందించే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### రెండు నిమిషాల్లో ఖాళీ

ఇందల్వాయి సహకార సంఘంలో సోమవారం యూరియా వచ్చింది. దీంతో సొసైటీ సిబ్బంది 900 బస్తాల స్టాక్ ఉన్నట్లు ఆన్‌లైన్‌లో ఎంటర్ చేశారు. కేవలం రెండు నిమిషాల్లోనే మొత్తం బుకింగ్ పూర్తయిందని రైతులు ఆగ్రహించి ఆందోళనకు దిగారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో లేకపోతే సాగు ఎలా కొనసాగించాలని ప్రశ్నించారు.

### పొట్ట దశలో యూరియా కీలకం

ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి పంట కీలకమైన పొట్ట దశకు చేరుకుంది. ఈ దశలో వరితో పాటు ఇతర పంటలకు కూడా యూరియా అత్యవసరం ఉంటుందని రైతులు చెప్తున్నారు. సకాలంలో ఎరువులు వేయకపోతే పంట ఎదుగుదలపై ప్రభావం పడటంతో పాటు దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక పంటల పరిస్థితిపై ఆందోళన చెందుతున్న రైతులకు యూరియా కొరత మరో సమస్యగా మారింది.

### ‘బడా రైతులకే’ ప్రాధాన్యమా?

యూరియా పంపిణీపై కొందరు రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బంది, ఫర్టిలైజర్ డీలర్లు.. స్టాక్ వచ్చిన విషయం సొసైటీ ఛైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, నాయకులు, ఊళ్లో పేరు మోసిన పెద్ద రైతులకు ముందుగానే సమాచారం చేరవేస్తురని ఆరోపిస్తున్నారు. యాప్‌లో స్టాక్ కనిపించిన వెంటనే తెలిసిన వ్యక్తుల పట్టాదారు పాస్‌బుక్ వివరాలతో యూరియా బుక్ చేయిస్తున్నారని, సాధారణ రైతులకు అవకాశం దక్కడం లేదని వాపోతున్నారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానం.. క్షేత్రస్థాయిలో రైతులకు మాత్రం ఇబ్బందిగా మారింది.

### రోజుల తరబడి తిరుగుతున్నాం



‘పంటకు యూరియా వేయాల్సిన సమయం వచ్చింది. కానీ ఎరువుల దుకాణాల చుట్టూ తిరిగినా యూరియా దొరకడం లేదు. ఒకవైపు వర్షాలు సరిగా లేక పంటపై ఆందోళనగా ఉంటే.. మరోవైపు యూరియా కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. చాలామందికి స్మార్ట్ ఫోన్‌లో యాప్ ఎలా ఉపయోగించాలో, ఎలా బుకింగ్ చేసుకోవాలో తెలియదు.

– **చిక్కెల మోహన్, రైతు, సాంపల్లి**

### పనులు మానేసి..



ఫోన్‌లో యూరియా బుకింగ్ ఎలా చేయాలో, ఏం నొక్కాలో అసలు తెలియదు. పంటకు ఎరువు కావాలి అంటే ఇప్పుడు ముందుగా యాప్‌లో బుక్ చేసుకోవాలంటున్నారు. బుకింగ్ కోసం సొసైటీకి వెళ్తే ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింకు లేదని చెప్తున్నారు. ఆధార్ కేంద్రానికి వెళ్లి నంబర్ లింకు చేసుకున్నాను. ఇప్పుడు బుక్ చేద్దామంటే యూరియా దొరకడం లేదు. పనులు మానేసి ఎరువు కోసం తిరగాల్సి వస్తోంది.

– **భూక్య కిషన్, రైతు, ఇందల్వాయి**

## ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతిఒక్కరి పేరుండాలి : నుడా ఛైర్మన్ కేశ వేణు




**అక్షరటుడే, ఆర్మూర్:** ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతిఒక్కరి పేరుండాలని నుడా ఛైర్మన్ కేశ వేణు అన్నారు. ఆలూర్ మండలంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను ఆయన డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మంగళవారం పరిశీలించారు. బూత్‌స్థాయి అధికారులు, బీఎల్‌ఏలతో మాట్లాడి ఎస్‌ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్న తీరును తెలుసుకున్నారు. అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హులైన పేర్లను నిబంధనల ప్రకారం గుర్తించేలా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఆలూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేగాం ప్రమోద్, దేగాం సర్పంచ్ ఇట్టేడి లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ మోతీరామ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు యాదగౌడ్ తదితరులున్నారు.

## ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన





**అక్షరటుడే, కామారెడ్డి :** ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. డీఎస్పీ మధుసూదన్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆటో డ్రైవర్లు తమ వాహనాలకు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రయాణికుల భద్రతతో పాటు తమ భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం సైబర్ క్రైం ఎస్సై నరేష్, రామంచ తిరుపతి కళాబృందం సభ్యులు ఆటో డ్రైవర్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ పట్టణ సీఐ నరహరి, ట్రాఫిక్ ఎస్సై చంద్రశేఖర్ గౌడ్, ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు



**అక్షరటుడే, బాల్కొండ:** జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో కంటిచూపు లోపం ఉన్న విద్యార్థినులకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన ఆమె కంటి చూపు లోపాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా కంటి చూపు లోపాలు ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందించే కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్, వైద్యాధికారి స్రవంతి, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి సూర్యనారాయణ, సాయి, సంతోష్, శ్రీనివాస్, భాగ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ భవాని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్ నోటీసులపై కంగారుపడొద్దు : మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి



**అక్షరటుడే, కామారెడ్డి:** ఓటరు జాబితాలో పొరపాట్లను సరి సిద్ధేందుకు సర్ నోటీసులు జారీ చేస్తున్నారని, వాటిపై ఎవరు ఆందోళన చెందవద్దని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. మంగళవారం ఆమె జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఎస్‌ఐఆర్ నోటీసుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2002 నాటి ఓటర్ లిస్టుతో ప్రస్తుత ఓటర్ లిస్టు సరిపోలకపోవడం వల్ల చాలా మందికి నోటీసులు వస్తున్నాయనన్నారు. చిన్నపాటి పొరపాట్లు, అక్షర దోషాలు ఉన్నా సరే నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఎవరూ కంగారు పడవద్దని, తగిన ఆధారాలు చూపించి బీఎల్‌వోలకు సహకరించి ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. అధికారులు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్లు అంజాద్, నాయకులు కాళ్ల గణేష్, రామ్మోహన్, కోఆప్షన్ సభ్యుడు ముబాషీర్ పాల్గొన్నారు.

## సరైన భోజన వసతి కల్పించాలి..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బాలురకు సరైన భోజనం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నీలిమ ముద్దసాని అధికారులను ఆదేశించారు. కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న మొదటిరోజే మంగళవారం ఆమె జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన వసతి గృహాన్ని తనిఖీ చేశారు. నీలిమా ముద్దసాని పరిశీలన గృహంలో విద్యార్థులతో మాట్లాడారు. వారు చేసిన తప్పులను గుర్తుచేసి వాటికి తగు చట్టాలను తెలియ చేశారు. బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని బాలురకు సూచించారు. ఇలాంటి పనులు మళ్లీ చేయవద్దని బాగా చదువుకోవాలని సూచించారు.

## బోధన్‌లో కవిత పోటీ చేస్తానంటే స్వాగతిస్తాం: మాజీ ఎమ్మెల్యే షకీల్



**అక్షరటుడే, బోధన్ :** బోధన్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పోటీ చేస్తానంటే స్వాగతిస్తామని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కవితపై తనకు అపారమైన గౌరవం ఉందని షకీల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎవరైనా కొత్తగా పార్టీలు పెట్టుకునే స్వేచ్ఛ ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు చేయాలి తప్ప వ్యక్తిగత విమర్శలు చేయరాదని షకీల్ సూచించారు. అలాగే వెయ్యి రోజుల కాంగ్రెస్ అసమర్థ పాలనపై నిరసన కార్యక్రమాలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గానికి దిష్టిబొమ్మలా మారాడని.. ఆయనతో బోధన్ నియోజకవర్గానికి ఎటువంటి ఉపయోగం లేదన్నారు. పక్క నియోజకవర్గానికి నిధులు ఇప్పించే సుదర్శన్ రెడ్డి తన సొంత నియోజకవర్గానికి మాత్రం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల ప్రభుత్వంగా మారిందన్నారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను 22ఏ కింద నిషేధిత భూములుగా మార్చారన్నారు. ఒక్క బోధన్ నియోజకవర్గంలోని బోధన్ మున్సిపాలిటీలో 3,500 నివాస గృహాలను కూడా 22-ఏ కిందకి తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. వీటన్నింటిపై బోధన్ నియోజకవర్గంలో వారం రోజులపాటు ప్రతి మండలంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గిరిధర్ గంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, ఆయా మండలాల అధ్యక్షులు నర్సయ్య, శ్రీరాములు, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కవిత నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు



**అక్షరటుడే, భీమ్‌గల్:** కవిత చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తాను కవితను, కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నించానో, విడదీయడానికి ప్రయత్నించానో కేసీఆర్‌కు బాగా తెలుసన్నారు. లింబాద్రి గుట్టపై పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ లైన్ దాటిన తర్వాతే కేసీఆర్ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. తాను, తన తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావానికి ముందే 2001లో టీఆర్ఎస్‌లో ఉన్నామని గుర్తుచేశారు. ‘బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి.. ప్రశాంత్‌రెడ్డి అంటేనే బీఆర్ఎస్’ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో తాను మంతనాలు చేశానని కవిత చేసిన వ్యాఖ్యలపై ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ‘కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా? కవితనా?’ అని ప్రశ్నించారు. అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాడుతున్నది తానా? కవితనా? అని నిలదీశారు. కాంగ్రెస్‌లోని ఏ నాయకుడితోనూ తాను మంతనాలు చేయలేదని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో చెప్పగలనన్నారు. అదే విధంగా కవిత కూడా కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి రహస్య మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. స్వలాభం కోసం ఇతరుల వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదన్నారు.

## వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలపై గ్రామసభ



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని వేంపల్లి గ్రామంలో 'వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు'లో భాగంగా మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, నీటి సంరక్షణకు సంబంధించిన పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమం, ఇంకుడు గుంతలు, పంట కుంటలు, కమ్యూనిటీ సోక్‌పిట్, డ్రెయిన్ సోక్‌పిట్, ఫామ్ పాండ్, నీటి కుంటలు, బోర్ రీచార్జ్ వంటి నీటి సంరక్షణ కార్యక్రమాలపై అధికారులు వివరించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ఆయా పనులను విస్తృతంగా చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, అందరూ ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ మహేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి లత, ఏపీవో, ఐకేపీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.




## చిరుతల సంచారంపై ఆందోళన వద్దు

**అక్షరటుడే, మాక్లూర్:** కల్లెడ గ్రామ సమీపంలో చిరుతలు సంచరిస్తున్నాయనే వార్తలపై ప్రజలు ఆందోళన చెందొద్దని ఆర్మూర్ రేంజ్ అటవీ శాఖాధికారి అరుణ్ కుమార్ సూచించారు. రోడ్డు పక్కన చిరుతలు కనిపిస్తున్నట్లుగా సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఉదయం నుంచే చుట్టూ ప్రాంతంలో పులుల సంచార ఆనవాళ్లను గుర్తించేపనిలో పడ్డారు. అనంతరం కల్లెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అటవీశాఖాధికారి అరుణ్ కుమార్ పులుల సంరక్షణపై అవగాహన కల్పించారు. రాత్రి సమయాల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని కోరారు. ఒకవేళ రాత్రివేళల్లో బయటకి వెళ్తే ఇద్దరి కంటే ఎక్కువగా గుంపుగా వెళ్లాలని సూచించారు. చిరుతలు కనిపిస్తే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుష్మిత, అధికారులు అశోక్, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై చర్యలు



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై మున్సిపల్ అధికారులు మంగళవారం దాడులు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు వ్యాపార సముదాయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగిస్తున్న పలువురు వ్యాపారులను గుర్తించి, వారి నుంచి నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్కడికక్కడే జరిమానాలు విధించారు. మున్సిపల్ కమిషనర్ గజానంద్ మాట్లాడుతూ.. పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కిరాణా దుకాణాల నిర్వాహకులు ఒకసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్ స్థానంలో పర్యావరణహితమైన సంచులను అందుబాటులోకి తేవాలన్నారు. రాబోయే రోజుల్లోనూ ఈ తనిఖీలు తీవ్రతరం చేస్తామని, నిషేధిత ప్లాస్టిక్ వాడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కమిషనర్ స్పష్టం చేశారు.




**రాష్ట్రంలో పాఠశాల విద్యలో విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ-2009) స్ఫూర్తితో అమలవుతున్న నిరంతర సమగ్ర మూల్యాంకన (సీసీఈ) విధానానికే ఇప్పుడు ముప్పు వాటిల్లింది. విద్యార్థి సమగ్ర వికాసం, ఒత్తిడి లేని అభ్యసనం లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఏకపక్షంగా తిరగదోడటంపై ఉపాధ్యాయ, విద్యావేత్తల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.**

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

# 'ఎక్స్‌టర్నల్' దెబ్బ..!

- **విద్యాశాఖ డైరెక్టర్ ఏకపక్ష నిర్ణయంపై విద్యావేత్తల ఆగ్రహం**
- **విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం..!**

సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ 1, ఎస్ఏ 2) పరీక్షలకు ఎక్స్‌టర్నల్ వాల్యుయేషన్ ప్రవేశపెడుతూ డైరెక్టరేట్ ఇటీవల జారీచేసిన ఉత్తర్వులు వివాదానికి దారి తీశాయి. ఈ నిర్ణయం వెనుక శాస్త్రీయత ఏమిటని.. ఏ నిపుణుల కమిటీ సిఫార్సు మేరకు ఈ మార్పు తెచ్చారని.. రాష్ట్రస్థాయి విద్యావిధానాన్ని మార్చే అధికారం డైరెక్టర్‌కు ఉందా అని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంత పెద్దపాలసీ నిర్ణయం రాత్రికిరాత్రే ఎలా ప్రకటిస్తారని వారంటున్నారు.

### సీసీఈ మౌలిక సూత్రాలకే మంగళం..

సీసీఈ విధానం ప్రధాన ఉద్దేశం భయం లేని, నిరంతర మూల్యాంకనం. విద్యార్థిని రోజువారీ తరగతి గదిలో పరిశీలిస్తూ, అతని బలాలు, బలహీనతలను గుర్తించి సరిదిద్దే బాధ్యత ఆ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడిదే. ఎక్స్‌టర్నల్ కారణంగా ఏడాది పొడవునా చేసే ఫార్మెటివ్ అసెస్‌మెంట్ ప్రాధాన్యత కోల్పోతుంది. సొంత టీచర్ కాకుండా బయటి వ్యక్తులు పేపర్లు దిద్దుతారనే భావన విద్యార్థుల్లో మళ్లీ బోర్డు పరీక్షల నాటి భయాన్ని, ఒత్తిడిని పెంచుతుంది. ఇది ఆర్‌టీఈ లక్ష్యానికి విరుద్ధం. సబ్జెక్టు బోధించిన టీచర్‌కే విద్యార్థి సామర్థ్యంపై పూర్తి అవగాహన ఉంటుంది. బయటి వారితో దిద్దించడం అంటే సొంత ఉపాధ్యాయుల నిజాయితీ, విశ్వసనీయతను శాఖే శంకిస్తున్నట్లేనని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. ఆర్‌టీఈ ప్రకారం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఫెయిల్ చేసే విధానమే లేదు. అలాంటప్పుడు ఎక్స్‌టర్నల్ వాల్యుయేషన్ వల్ల సాధించేదేమిటని వారు పేర్కొంటున్నారు. దీనివల్ల ప్రభుత్వంపై దాదాపు రూ.10 కోట్లకు పైగా అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు, వేలాది మంది టీచర్లు విలువైన బోధనా గంటలు వృథా అవుతాయని అంచనా.

### ప్రభుత్వ పాలసీని శాఖాధిపతి మార్చవచ్చా?

నిబంధనల ప్రకారం సీసీఈ అనేది రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన చట్టబద్ధమైన విధానం. దాన్ని మార్చాలంటే మంత్రి, విద్యాశాఖ కార్యదర్శి, క్యాబినెట్ స్థాయిలో నిర్ణయం జరగాలి.

శాఖాధిపతులు కేవలం ప్రభుత్వ విధానాలను అమలు చేసేవారే తప్ప, విధానాల స్వరూపాన్నే మార్చే అధికారం వారికి లేదు. కాబట్టి విద్యార్థుల భవిష్యత్తును, విద్యా వ్యవస్థ లక్ష్యాలను దెబ్బతీసే ఈ ఎక్స్‌టర్నల్ వాల్యుయేషన్ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వమే సీసీఈలో మార్పులు చేయదలిస్తే నిపుణుల కమిటీ వేసి, దాని నివేదికపై ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, విద్యావేత్తలతో చర్చించి పాలసీ నిర్ణయం తీసుకోవాలి. విద్యాశాఖలో ప్రతి నిర్ణయం ఒక తరం భవిష్యత్తుతో ముడిపడి ఉంటుందని, హడావుడి ఉత్తర్వులకు స్వస్తి పలికి శాస్త్రీయ విధానంలో ముందుకు సాగాలని కోరుతున్నారు. ఈ నిర్ణయంపై పున: సమీక్ష చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.




## ఉచిత కంటి వైద్యశిబిరం

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 15 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మోతిబిందు ఉన్నవారిని గుర్తించి, శస్త్రచికిత్స కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, కార్యదర్శి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



## పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** పాత పద్ధతిలోనే ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం పాల్వంచలో కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై అన్నదాతలు ఆందోళన చేపట్టారు. యూరియా వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. యూరియా యాప్ వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రైతులలో అనేక మంది చదువు రాని వాళ్లు ఉన్నారని, యూరియా బుక్ చేసుకోవడం తెలియక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే, బాన్సువాడ :** మండలంలోని తాడ్కోల్ జీపీ కార్యాలయం వద్ద ఐదు,ఆరు, ఏడవ రేషన్ షాపుల పరిధిలోని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ అందె రమేష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా, సులభంగా ప్రజా పంపిణీ వ్యవస్థ సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సీహెచ్ సతీష్ కోరారు. వినాయక నవరాత్రుల సందర్భంగా కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ గ్రామంలో పోలీస్ శాఖ తరపున మండపాల నిర్వాహకులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మండపాల ఏర్పాటుకు, సౌండ్ సిస్టమ్స్ వినియోగానికి సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని.. రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాకేష్, వీడీసీ చైర్మన్ గంగాధర్, ఉప సర్పంచ్ శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎర్రపాటి శ్రీను ఎన్నిక



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎర్రపాటి శ్రీను ఎన్నికయ్యారు. అసోసియేషన్‌కు సంబంధించిన ఎన్నికలు నగరంలోని సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు సంఘంలో మొత్తంగా 40మంది సభ్యులు ఉన్నారు. వీరి మధ్య ఎన్నిక నిర్వహించగా.. అధ్యక్షుడిగా ఎర్రపాటి శ్రీను ఎన్నికయ్యారు. అనంతరం పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. పోలీసుల సమస్యల పరిష్కారానికి సంఘం తరపున కృషి చేస్తామన్నారు. ఉన్నతాధికారుల మద్దతుతో ముందుకు వెళ్తామన్నారు.

## సర్ నోటీసులపై 'హియరింగ్'



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గుజ్జుల తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఎస్ఐఆర్ నోటీసులపై హియరింగ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతిఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలన్నారు. తమ వివరాలను సక్రమంగా పరిశీలించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల్ తండా సర్పంచ్ ఖత్రోత్ రవీందర్, ఉప సర్పంచ్ విశ్లావత్ రమేష్, లొంక తండా సర్పంచ్ నేనావత్ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, రాజు, నరేష్, రవీందర్, జీపీవో శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

## పారిశుధ్యం, మౌలిక వసతులపై బల్దియా ప్రత్యేకదృష్టి



**అక్షరటుడే, బాన్సువాడ :** పట్టణంలోని 2వ వార్డులో మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ మంగళవారం పర్యటించారు. వార్డులోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించి పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతుల పరిస్థితిని తెలుసుకున్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకుని పారిశుధ్య లోపాలు, చెత్త సేకరణ, డ్రైనేజీ సమస్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కమిషనర్ తెలిపారు. అనంతరం ఎస్ఐఆర్ నోటీసుల జారీకి సంబంధించిన వివరాలను బీఎల్‌వో మాధవిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జంగం రాజశేఖర్, కోఆప్షన్ సభ్యులు కాసుల రోహిత్, ముజీబ్, కొట్టం గంగాధర్, పురుషోత్తం, నర్సుగౌండ, సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో అసంతృప్తి'



**అక్షరటుడే, ముప్కాల్:** కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో మాట్లాడామన్నారు. ఈ సమావేశంలో ముప్కాల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, కార్యదర్శి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని పెద్దమ్మకాడితండా గ్రామపంచాయతీలో ఉపాధి పనులను డీఆర్‌డీవో, ఎంపీడీవో మంగళవారం పరిశీలించారు. 'జలసిరి' పథకం కింద నిర్మిస్తున్న ఫార్మ్ పాండ్లను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న వీవో బిల్డింగ్ సోఫిట్ పనులను పరిశీలించిన అధికారులు, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని డీఆర్‌డీవో కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య రమేష్ నాయక్, పంచాయతీ కార్యదర్శి మమత, ఐకేపీ ఏపీఎం ప్రమీల, సీసీలు శ్రీనివాస్, నరేష్, టీఏలు రమేష్, పూర్ణచందర్, ఈసీ రత్నాకర్‌తో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.